సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 140 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 30 సెప్టెంబర్ 2025 | పేజీలు : 4







# పూల జాతర

## వైభవంగా సద్దుల సంబురం

- బతుకమ్మ వేడుకలను ప్రారంభించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా
- మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

2


తెలంగాణ
ప్రభుత్వం





















# స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వెల్లడి



**జనగామ, మన చౌరాస్తా :** స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు జనగామ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా షేక్ వెల్లడించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనగామ జిల్లా నుంచి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పండెరి చేతన్ నితిన్‌తో కలిసి సంబంధిత అధికారులతో పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడంలో ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు పాటిస్తూ పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని, ప్రతి అంశం రికార్డ్ పరంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామన్నారు. జిల్లాలో 134 ఎంపీటీసీ, 12 జడ్పిటిసి లు ఉన్నాయని, ఆయా స్థానాలకు ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఆర్వోలు, అసిస్టెంట్ ఆర్వోలను నియమించి ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. మరోసారి కూడా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. 280 గ్రామపంచాయతీ లకు సంబంధించిన సర్పంచ్ ఎన్నికలు 3 విడతలలో రెండు దఫాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను పటిష్టంగా అమలు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో జెడ్పి డిప్యూటీ సీఈవో సరిత, డీపీఓ స్వరూప, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## సరస్వతి రూపంలో..

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో 8వ రోజు సోమవారం అమ్మవారు శ్రీసరస్వతి దేవిగా దర్శనం ఇచ్చారు. చదువుల తల్లి సరస్వతి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారు త్రిశక్తులలో ఓ స్వరూపం అయిన సరస్వతి దేవి అలంకరాన్ని దర్శించుకోవడమే మహాభాగ్యంగా భక్తులు భావిస్తారు. దేవిని దర్శించుకొని ఆరాధిస్తే బుద్ధి వికాసం ,విద్యాలాభం కలుగుతుందని జ్ఞాన ప్రదాతగా కొలుస్తారు. అమ్మవారిని తెలుపు రంగు వస్త్రాలు వీణా వాయిణిగా అలంకరించి దద్దోజనం పాయసాలను నైవేద్యంగా నివేదించారు. మంగళారతులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మారుపాక శ్యాం ప్రసాద్, లగిశెట్టి పద్మావతి, దూడల శోభారాణి, మోటె రేణుక, ఆలేటి పద్మ, బాలలక్ష్మి, వాణి, లలిత, బండోజు సరళ, మినులాపురం శోభా,రూప, జ్ఞానమ్మ తదితరులు పాల్గొన్నారు.






## మల్లన్నను దర్శించుకున్న పాట్నా హైకోర్టు జడ్జి

కొమురవెల్లి, మన చౌరాస్తా : కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ఆదివారం పాట్నా హైకోర్టు జడ్జి గున్ను అనుపమ చక్రవర్తి కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు స్వామివారి శేష వస్త్రాలతో పాటు ప్రసాదాన్ని అందజేసి వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఘంటసాల వెంకటేశ్ పాల్గొని వారికి స్వామి వారి చిత్రపటాన్ని అందజేయగా ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకుడు శ్రీరాములు, సిద్దిపేట జడ్జ్ సాధన, కొమరవెల్లి ఎస్సై రాజు గౌడ్, సిద్దిపేట, చేర్యాల కోర్టుల సూపరింటెండెంట్లు శ్రీహరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయంలో అంకురార్పణ

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఆగ్రోదగం, గణపతి పూజ తో పాటు మొదలుకొని మంటపదేవత దేవత ఆరాధన, కలిశ స్థాపన అమ్మవారికి విశేషంగా చతుర్దశప్రచార మహా పూజ అనంతరం మహాగణపతి మరియు లక్ష్మీపు గణపతి మండపదేవత ఆరాధన, మరియు సరస్వతి హోమం, మంగళహారతి, మహా మంత్ర పుష్ప సమర్పణ తదనంతరం కార్యక్రమాలను నిర్వహించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి వెంకటేష్, ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ ఏఈఓ శ్రీనివాస్, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, అంజిరెడ్డి, పర్యవేక్షకులు శ్రీరాములు, ఒగ్గు పూజారులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** మండలంలోని, గురువన్నపేట గ్రామానికి చెందిన కొత్వాల నర్సయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకున్న బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి పరామర్శించడం జరిగింది .మృతుడి కుటుంబానికి బీఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ఏ ఆపద ఉన్న నేనున్నానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన నాయకులు,బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## విద్యార్థులు చదువులో రాణించాలి

**నకిరేకల్, మన చౌరాస్తా :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గామాత శ్రీ సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామంలోని వివేకానంద యువజన మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారి వద్ద సీఐ వెంకటేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీ పూజ అనంతరం చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. అనంతరం సీఐని, పంచాయతీ కార్యదర్శి మధును యువజన మండలి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్, యువజన మండలి అధ్యక్షుడు కొల్లు వివేక్, సీనియర్ సభ్యులు రామ్‌నారాయణ, సైదులు, మాజీ అధ్యక్షులు కోటగిరిరామకృష్ణ, పుట్ట సాయి, కొప్పు భరత్, నర్సింగ్ నాగరాజు, కోటేషు, నాగారం శ్రీకాంత్ తాడ్వాయి సంపత్, పుట్ట విజయ్ పలువురు యువజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## సిద్దిపేట కలెక్టర్‌కు ఆహ్వానం



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సంబంధించిన 50 గదుల సత్ర నిర్మాణాన్ని పరిశీలన చేయడానికి సిద్దిపేట జిల్లా కలెక్టర్ ను ఆహ్వానించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి టంకటాల వెంకటేష్ తెలిపారు. ఇందులో భాగంగా 50 గదుల సత్ర నిర్మాణం మరియు క్యూ కాంప్లెక్స్ ను నిర్మాణం, జరుగుతున్న పనులను అలాగే జరగబోయే పనులను నూతనంగా నిర్మించబోయే వంద గదుల సత్ర నిర్మాణ పలునను కలెక్టర్‌కు వివరించారు. ఇందుకు కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే కొమరవెల్లి మల్లన్న దేవాలయాన్ని దర్శిస్తానని, అలాగే పనులను త్వరగా జరిగేటట్లు చూస్తానని పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని కలెక్టర్ తెలిపారు.



# జనగామలో ఓసీలకు అన్యాయం

- డీసీసీ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** రాజ్యాంగ బద్ధంగా రావలసిన 33 శాతం సీట్లు ఓసీలకు రావాల్సిందేనని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్వర్ రెడ్డి అన్నారు. నేడు కలెక్టర్లకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయించేందుకు వినతి పత్రం అందించినున్న సందర్భంగా జిల్లాలో ఉన్న ఓసీ మిత్రులందరు కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రభుత్వం తీసుకున్న 42 శాతం బీసీ రిజర్వేషన్, 15 శాతం ఎస్సీ రిజర్వేషన్, 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ ప్రకారం జిల్లాలో 67 శాతం రిజర్వేషన్ పోను 33 శాతం స్థానాలు అన్ రిజర్వుడ్ స్థానాలు ప్రకటించాలన్నారు. కానీ అలా కాకుండా జనగామ జిల్లాలో 2 జడ్పిటిసిలు, 2 ఎంపీటీలు మాత్రమే వచ్చాయన్నారు. ఈ విషయంలో అన్ రిజర్వ్డ్ స్థానాల్లో పోటీ చేసే వ్యక్తులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయంపై నేడు జనగామ జిల్లా కలెక్టర్, డీపీవోలను కలిసి వినతి పత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు.





# బతుకమ్మ వేడుకల్లో మంత్రి పొన్నం

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ సాంప్రదాయాలకు ఆచారాలకు ప్రతిక రంగురంగుల పూలతో గౌరమ్మను కొలుచుకుంటూ ఆనందంగా బతుకమ్మ పాటలు పాడుతూ అందరూ చల్లగా ఉండాలని అక్క చెల్లెలు అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు పెద్ద జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మంచి వర్షాలతో పాడి పంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నానని మంత్రి తెలిపారు.దసరా పండుగ సందర్భంగా సాయంత్రం రాంలీలా చేసుకుందామని వచ్చే ఏడాది వరకు ఎల్లమ్మ చెరువు అద్భుతంగా సుందరీకరణ చేసుకునేలా పనులు జరుగుతున్నాయి.. మరిన్ని సౌకర్యాలతో పండగ చేసుకుందామని ఆయన అన్నారు.



# సంబురంగా సద్దుల బతుకమ్మ

## పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల కేంద్రంలో బతుకమ్మ పండుగను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పాడి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. సాంప్రదాయ గీతాలు, పూల బతుకమ్మలతో మండల కేంద్రం పండుగ వాతావరణంలో కళకళలాడింది. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ఈ పండుగ మన సంప్రదాయాలు, సంస్కృతి, ఆచార వ్యవహారాల సౌందర్యాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో, పూలతో బతుకమ్మలను అలంకరించి, గీతాలు పాడుతూ జరుపుకోవడం సమాజంలో ఐక్యత, స్నేహభావం పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# దుర్గమాతకు ప్రత్యేక పూజలు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** దుర్గ మాత చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జిల్లా సందీప్ అన్నారు. శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా హిందు వాహిని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి మండపం వద్ద సహకరించిన దాత కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జిల్లా సందీప్‌ను కమిటీ సభ్యులు సన్మానించారు. తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలని ప్రత్యేక మొక్కులు చెల్లించారు.

# జఫర్‌గఢ్ ఎస్సై సస్పెండ్



**జఫర్‌గఢ్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా వర్ధన్నపేట ఏసీపీ పరిధిలోని జఫర్గడ్ ఎస్సై రామ్ చరణ్ ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషన్ సన్ ప్రీత్ సింగ్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జఫర్గడ్ ఎస్సైగా పనిచేస్తున్న రామ్ చరణ్ ఫిర్యాదారుల నుండి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పోలీసులు ఉన్నత అధికారులు విచారణ జరిపి సీపీకి నివేదిక అందించారు. సిపీ కి అందిన నివేదిక మేరకు రామ్ చరణ్ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. మహబూబాద్ జిల్లా పెద్దవంగర ఎస్సైగా పనిచేస్తూన్న సమయంలో ఉప్పరగూడెం గ్రామ సర్పంచ్ భర్తను కొట్టినట్లు ఆరోపణలు రావడంతో గతంలో ఒకసారి సస్పెండ్ కు గురయ్యారు.

# కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఎస్సైల బదిలీ

**హనుమకొండ, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో టాస్క్ ఫోర్స్ ఎస్.ఐ గా విధులు నిర్వహిస్తున్న కె. వంశీ కృష్ణను సంగెం పోలీస్ స్టేషన్ కు బదిలీ చేయగా, ఇదే పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎల్. నరేష్‌ను మీల్స్ కాలనీ ఎస్. ఐగా బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.